గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

-సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య

ములుగు, జూలై 4, ప్రభాతవార్త:

గ్రామపంచాయతీ కార్మికులకు బకాయిపడ్డ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించకుంటే ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె నిర్వహిస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ములుగు మండల అభివృద్ధి కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారిణి స్వర్ణకుమారికి పారిశుధ్య కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ 12గంటల పని విధానం అమలు చేయాలని కుట్ర చేస్తుందని అన్నారు. పెరుగుతున్న ధరలతో కార్మికుల కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటుంటే వేతనాలు పెంచకుండా ఉన్న వేతనాలు ఇవ్వకుండా కార్మికులపై పనిభారం పెంచుతూ బానిసలుగా మార్చుతుందని మండిపడ్డారు. కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మూడోసారి ప్రొఫెసర్, డెంటిస్ట్ అరవింద్‌కు రువాండా యూనివర్శిటీ ఆహ్వానం

సిద్దిపేట అర్బన్, జూలై 4, ప్రభాతవార్త:

సౌత్‌ఆఫ్రికాలోని మెడికల్ హెల్త్ సైన్స్ యూనివర్శిటీ ఆఫ్ రువాండా నుంచి ప్రొఫెసర్, డెంటిస్ట్ అరవింద్‌కు మూడోసారి డెంటిస్ట్ ఫైనల్‌పరీక్షల నిర్వహణకు ఎక్స్‌టర్నల్‌ఎగ్జామినర్‌గా ఆహ్వానం అందింది. దీంతో సిద్దిపేట పట్టణానికి చెందిన ప్రొఫెసర్, తెలంగాణ డెంటల్ ఆసుపత్రి డాక్టర్ అరవింద్‌కుమార్‌కు మూడోసారి అరుదైనగుర్తింపు లభించింది. సౌత్‌ఆఫ్రికాలోని స్కూల్ ఆఫ్ డెంటిస్ట్ కాలేజీ ఆఫ్ మెడిసిన్ అండ్ హెల్త్ యూనివర్శిటీ ఆఫ్ రువాండా ప్రిన్సిపాల్ ప్రొ॥అబ్రహం హెచ్‌ఎ మిటికె ఎండి ఈమేరకు బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీకి సంబంధించిన ఫైనల్‌పరీక్షలో ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ నిర్వహణకు డాక్టర్ అరవింద్‌కు లేఖరూపంలో ఆహ్వానం అందింది. ఈనెల 7నుంచి 12వరకు ఫైనల్‌పరీక్షలు జరగనున్నట్లు తెలిపింది. కాగా సిద్దిపేట కీర్తిప్రతిష్ఠలు చాటుతున్న డాక్టర్ అరవింద్‌కు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అభినందనలు తెలిపారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళులు

దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

జిల్లా కలెక్టరేట్‌లోని బిసి వెల్ఫేర్ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి, బిసిసంఘాల నాయకులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిబిసిడిఓ నాగరాజమ్మ, వివిధసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రోశయ్య జయంతి వేడుకలు..

ఉమ్మడి ఎపి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఉమ్మడిరాష్ట్రంలో సిఎం, ఆర్థికశాఖ మంత్రిగా పనిచేసి ఆయన అందించిన సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో డిడబ్ల్యుఓ లక్ష్మీకాంతరెడ్డి, ఎఓ అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఆకస్మికంగా తనిఖీచేసిన జిల్లా కలెక్టర్ హైమావతి

వంటలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

జిల్లా కలెక్టర్ హైమావతి శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం, సిద్దిపేట పట్టణంలో విస్తృతంగా పర్యటించి బిసి వెల్ఫేర్, మహాత్మాజ్యోతి బాపూలే, బాలికల గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఆకస్మికంగా తనిఖీచేశారు. పొన్నాల శివారులోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేసి వంటగదులతోపాటు విద్యార్థులకు వడ్డించే ఆహారపదార్థాలు, కూరలను పరిశీలించారు. అనంతరం విద్యారులసమస్యలు, విద్య అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను, హాజరుపట్టికలను తనిఖీచేశారు. అలాగే కెసిఆర్ నగర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను, జూనియర్ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. సిద్దిపేట పట్టణంలోని పాత ఇస్లామియా కాలేజీలో కొనసాగుతున్న తెలంగాణ అల్ప సంఖ్యాకుల బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. పాత ఎల్లంకి ఇంజనీరింగ్ కాలేజీలో కొనసాగుతున్న తెలంగాణ అల్ప సంఖ్యాకుల బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. ఎన్సాన్‌పల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఆమెవెంట అధికారులు తదితరులు ఉన్నారు.

సెంట్రల్ జైలును తనిఖీచేసిన న్యాయమూర్తి

కందిలోని సెంట్రల్ జైలును తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి సౌజన్య దృశ్యం

కంది, జూలై 4, ప్రభాతవార్త:

జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి సూచనలమేరకు శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి సౌజన్య కందిలోని సెంట్రల్ జైలును తనిఖీ చేశారు. జైలులోని బేరక్లు, గదులు, వంట గది, మరుగుదొడ్లు, జైలు పరిసరాలను పరిశీలించారు. జైలులు ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని జైలు సూపరింటెండెంట్‌ను న్యాయమూర్తి సౌజన్య సూచించారు. తమ కేసులను పరిష్కరించుకునేందుకు న్యాయ సేవలు ఉచితంగా అందుకోవచ్చని ఖైదీలకు సూచించారు. ఖైదీలకు అందిస్తున్న భోజన రుచిని న్యాయమూర్తి పరిశీలించారు. వంట గదిని పరిశీలించి వంటలు వండేందుకు సిద్దంగా ఉంచిన బియ్యం, కూరగాయాలు తదితరులను పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, జైలు సిబ్బంది ఉన్నారు.

కనులపండువగా జగన్నాథస్వామి రథయాత్ర

-రథాన్ని లాగిన వేలాదిమంది భక్తులు

-కనీవినీ ఎరుగనిరీతిలో రథయాత్ర

అశేష జనాల మధ్య జగన్నాథ రథయాత్ర

సదాశివపేట, జూలై 4, ప్రభాతవార్త:

సదాశివపేటలో మొట్టమొదటిసారిగా జరిగిన జగన్నాథ రథయాత్రకు జనం తండోపతండాలుగా వచ్చారు. పూరిలో జరిగే జగన్నాథ రథయాత్రకు ప్రతిసంవత్సరం కొన్ని లక్షలమంది వస్తుంటారు. ఇస్కాన్ టెంపుల్ సదాశివపేటవారి ఆధ్వర్యంలో జరిగిన ఈరథయాత్రకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తనయుడు టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్, కొత్త గొల్ల సోమశేఖర్ పట్టణ ముఖ్యనాయకులు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గమ్మ గుడి నుండి ప్రారంభమైన ఈరథయాత్ర గడిమైసమ్మ, గాంధీచౌక్ మీదుగా బసవ సేవాసదన్ వరకు కొనసాగింది. మహిళల కోలాటాలు హరేరామ హరేకృష్ణ నినాదాలతో పట్టణమంతా మారుమోగింది. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఫలహారము మంచినీటి సౌకర్యము కల్పించారు. ఈమహారథాన్ని లాగే కార్యక్రమంలో సదాశివపేటలోని మహిళలు అత్యధికంగా ఉత్సాహంగా కనిపించారు.

సిగాచి రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది

-సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న సిఎస్ రామకృష్ణారావు

సంగారెడ్డి మున్సిపాలిటీ, జూలై 4, ప్రభాతవార్త:

సిగాచి సంఘటనా స్థలంలో ఇప్పటికీ సహాయక బృందాలు పనిచేస్తున్నాయని, మిస్సయినవారి వివరాలు లభించే వరకు రెస్క్యూ టీమ్‌లు శోధన కొనసాగిస్తాయని జిల్లాకలెక్టర్ పి.ప్రావీణ్య శుక్రవారం తెలిపారు. ఇంకా 9మంది ఆచూకీ లభ్యం కాలేదు. వీరికోసం మృతదేహాల అవశేషాలు, వ్యక్తిగత వస్తువులు, ఆధారాలు అన్నింటినీ సేకరించి, అవసరమైన డిఎన్ఎశాంపిల్స్ ల్యాబ్‌కు పంపించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 39మంది మృతులను డిక్లేర్ చేశారు. ఇందులో 5గుర్తించని మృతదేహాలకు సంబంధించి రిపోర్టులు వచ్చేవరకు వేచి చూస్తున్నామన్నారు. పాశమైలారంవద్ద ప్రత్యేకంగా ఒక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, ఇక్కడ 11మంది మిస్సింగ్‌వ్యక్తుల కుటుంబీకులకు తాత్కాలికంగా వసతిని ఏర్పాటు చేశామన్నారు. వారికి అవసరమైన భద్రత, ఆహారం, ఆరోగ్య సదుపాయాలు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షత గాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం 23 మంది క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వీరికి ప్రభుత్వసూచనలమేరకు ప్రత్యేకవైద్యసిబ్బందిని ఏర్పాటుచేసి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. మానసికంగా, శారీరకంగా వారికి సహాయపడే విధంగా అవసరమైన కౌన్సెలింగ్ సేవలు అందజేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, అధికారులు సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, వైద్య, ఫైర్ డిపార్ట్‌మెంట్, ఫారెన్సిక్, డిజాస్టర్‌రెస్పాన్స్‌టీమ్‌లు సమన్వయంతో పని చేస్తున్నాయని అన్నారు. ఈ ప్రమాదం తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి బాధిత కుటుంబానికి అన్నిరకాల భరోసా కల్పించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. త్వరితగతిన మిగిలిన మిస్సింగ్ వ్యక్తులను గుర్తించే చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి కలెక్టర్ ఆదేశించారు.

సిగాచి బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది...

రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు..

సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన కార్మికుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన పటాన్‌చెరు మండలం, పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచిఫార్మా పరిశ్రమను సందర్శించారు. స్పెషల్‌సెక్రటరీ రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌శాఖ, అరవింద్‌కుమార్, పరిశ్రమలు,కార్మిక శాఖ, స్పెషల్ సెక్రటరీ దాన కిషోర్, జిల్లాకలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్, అగ్నిమాపకశాఖ అధికారులతో పరిశ్రమలో అగ్నిమాపకశాఖ, పొల్యూషన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది,పరిశ్రమలశాఖసిబ్బంది,కంపెనీప్రతినిధులు, పోలీసులు, రెవెన్యూ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష జరిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, పరిశ్రమల భద్రతాప్రమాణాలు, సేఫ్టీ మెకానిజం నిర్వహణపై సంబంధితశాఖలతో ఆయన సమీక్షించారు. పరిశ్రమలో రియాక్టర్లు, డ్రైయర్లు, ఫైర్‌ఫైట్ సిస్టం, ఉద్యోగుల రక్షణ మార్గాలు, ఇతర భద్రతా అంశాలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. ప్రమాదంలో గాయపడినవారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన అన్నిచర్యలు చేపడుతున్నామనిస్పష్టంచేశారు. పరిశ్రమల భద్రతాప్రమాణాలపై పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామన్నారు. ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నవారి వివరాలు, మృతులవివరాలు మృతుల ఐడెంటిఫికేషన్ తదితర వివరాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబసభ్యుల కోసం ఐలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రాన్ని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతోమాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రకటించినవిధంగా త్వరలో మృతుల కుటుంబాలకు, క్షతగాత్రుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. సహాయచర్యలు మరింత సమర్థవంతంగా సాగేందుకు చర్యలు చేపట్టాలని ఈసందర్భంగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధితశాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంపై సిట్టింగ్ జడ్జ్‌తో విచారణ జరిపించాలి

-సిపిఐ ఎమ్మెల్యే కూనమనేని

సిగాచిపరిశ్రమలో జరిగిన సంఘటనపై సిట్టింగ్ జడ్జ్‌తో విచారణజరపాలని, ప్రమాదానికి యాజమాన్యం సంబంధిత అధికారులు పూర్తి బాధ్యత వహించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలి సిపిఐ ఎమ్మెల్యే రాష్ట్రకార్యదర్శి కూనమనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సిగాచి పరిశ్రమలో ప్రమాదానికి గురైనటువంటి బాధితులను ఆస్పత్రికివెళ్లి పరామర్శించి, అనంతరం సిపిఐ బృందంతో, పరిశ్రమ ఎండితో కలిసి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిగాచిపరిశ్రమలో జరిగినటువంటి దుర్ఘటన ఇప్పటివరకు దేశంలో ఏ పరిశ్రమలోకూడాజరగలేదని, దీనికి పరిశ్రమయాజమాన్యం, సంబంధిత అధికారులు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డ్ సేఫ్టీ అధికారులు, లేబర్ కమిషనర్లు, ప్రభుత్వం పూర్తిబాధ్యత వహించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద పవన్ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి. ప్రకాష్‌రావు సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి శ్రీమాన్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, సహాయ కార్యదర్శి ఎంఎ రెహమాన్, ఆనంద్, ఎండి.మహబూబ్‌ఖాన్,అశోక్‌రెడ్డి,పాండు,మొయినుద్దీన్, ఆసిన్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో అవినీతి ఆరోపణలు..

-దుకాణాల రీషెడ్యూల్‌కు డబ్బుల వసూళ్లు..?

-ఏ నోటిఫికేషన్ లేకుండా ఎఫ్‌టి చైర్మన్ కుమారునికి ఉద్యోగం..?

రామాయంపేట, జూలై 4, ప్రభాతవార్త:

రామాయంపేట పట్టణంలోని ధర్మాదాయ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉన్న చారిత్రక మహంకాళిదేవాలయంలో ఎఫ్‌టి చైర్మన్‌పై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయానికి సంబంధించిన వాణిజ్యసముదాయ దుకాణాల అగ్రిమెంట్ల నుంచి నియామకాల వరకు అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి మూడుసంవత్సరాలకు ఒకసారి జరిగే దుకాణాలలీజు అగ్రిమెంట్ల పునరుద్ధరణలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు బహిరంగంగానే చర్చ జరుగుతోంది.

అగ్రిమెంట్లగోప్యత, నియామకాల్లో నిబంధనల ఉల్లంఘన..?

మహంకాళి ఆలయానికిచెందినవాణిజ్యదుకాణాల అగ్రిమెంట్ల వ్యవహారం తీవ్ర ఆరోపణలకు దారితీస్తోంది. లీజుల పునరుద్ధరణ, పేర్లమార్పిడి సమయంలో భారీగా సొమ్ము చేతులు మారుతోందని, ఇది దేవాదాయశాఖ నిబంధనలకు విరుద్ధమని పట్టణప్రజలు గుసగుసలాడుతున్నారు. ఈవ్యవహారంలో పారదర్శకత కొరవడటంతో, అసలు లీజు నిబంధనలు ఏంటి...? ఎంతమొత్తం చెల్లించాలనే విషయాలపై స్పష్టత లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అలాగే ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ సరాఫ్ పాండురంగాచారి తన కుమారుడిని ఏకంగా ఆలయంలో ఆపరేటర్ పోస్టులో నియమించుకున్నారని, నిబంధనలకు విరుద్ధంగా వేలాది రూపాయల వేతనంచెల్లిస్తున్నారని తీవ్ర ఆరోపణలున్నాయి. దేవాదాయశాఖ నిబంధనలప్రకారం ఇటువంటి నియామకాలు చట్టవిరుద్ధం. కేవలం సొంతమనుషులకు ఉద్యోగాలు కల్పించేందుకే నిబంధనలను బేఖాతరు చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఆలయ ఆస్తులవివరాలు, వాటినిర్వహణపై స్పష్టత లేకపోవడంతో అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోందనేవాదన బలంగా వినిపిస్తోంది. అంతేకాకుండా, ఆలయ వ్యవహారాలన్నీ ఒకరి గుత్తాధిపత్యంలోనే జరుగుతున్నాయని, సాధారణ భక్తులు, ప్రజలకు ఎలాంటి సమాచారం తెలియడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

మహంకాళి ఆలయంలో గతకొన్నిసంవత్సరాలుగా జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని రామాయంపేటకు చెందిన ప్రజలు, భక్తులతోపాటు వివిధపార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దేవాదాయశాఖ అధికారులు ఈ ఆరోపణలపై ఎలాస్పందిస్తారో చూడాలి. ఆలయపవిత్రతను కాపాడి, దాని ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ వ్యవహారంపై ధర్మాదాయ దేవదాయశాఖ ఉన్నతాధికారులు మరింత లోతైన విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

చైర్మన్‌గా నేను ఎవరినైనా నియమించుకోవచ్చు ఎఫ్‌టి చైర్మన్ పాండురంగాచారి...

పాలకవర్గం సభ్యులు లేకుండా, ఎలాంటి తీర్మానం చేయకుండా, నోటిఫికేషన్ వెయ్యకుండా ఆపరేటర్ నియామకం ఎలాచేస్తారని ఎఫ్‌టిచైర్మన్ పాండురంగాచారిని ప్రభాతవార్త విలేకరి ప్రశ్నించగా చైర్మన్‌గా నాకు ఆ అధికారం ఉంటుందని, నేను ఎవరినైనా నియమించుకోవచ్చని అన్నారు. పాలకవర్గ సభ్యులకు ఎలాంటి హక్కులు ఉండవని, కేవలం పాలకవర్గం సభ్యులు, ప్రభుత్వం నుండి నిధులు తేవడం కోసమేనని, ఆనిధులు ఖర్చుచేయడం కూడా తన ఇష్టప్రకారంగా ఉంటుందని తెలపడం గమనార్హం. తాను దుకాణాలసముదాయం విషయంలో దుకాణదారులనుండి ఎలాంటిడబ్బులు తీసుకోలేదని చైర్మన్ పాండురంగాచారి స్పష్టంచేశారు. అనవసరంగా కొంతమందివ్యక్తులు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన వివరించారు.

బాలికావిద్య బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

-వసతి గృహాలలో సకల సౌకర్యాలు తప్పనిసరి

-కార్పొరేట్ విద్యకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించాలి

-జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, జూలై 4, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తూ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో సకల సౌకర్యాలు కల్పిస్తూ బాలికలను అన్ని రంగాలలో ముందుకు నడిపించే విధంగా బాలికల విద్యను బలోపేతంచేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాల కళాశాలతో పాటు నారాయణపూర్ గిరిజన బాలికల వసతి గృహాల్లోని పాఠశాలలు కళాశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేసి పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న బోధనా విధానాన్ని, మెనూను పరిశీలించారు. ముందుగా విద్యార్థినుల ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న ఆహార పదార్థాల మెనూ స్వయంగా పరిశీలించారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి స్టాక్ వివరాలను కళాశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వసతి గృహాలలో సౌకర్యాలను, బోధన, మెనూ వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థినీవిద్యార్థులకు సంక్షేమ హాస్టల్ కళాశాలలో వసతులు మెరుగుపరిచి కార్పొరేట్ స్థాయికి ధీటుగా నాణ్యమైన గుణాత్మకవిద్యను అందించాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకుపోతుందని దానికి అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా సంక్షేమ కళాశాలలను సందర్శించడం జరిగిందని కలెక్టర్ వివరించారు. మరుగుదొడ్ల నిర్మాణం, వసతి సౌకర్యం, సమస్యలను సంబంధిత పర్యటనల ద్వారా తెలుసుకొని సౌకర్యాలు మెరుగు దిశగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. అనంతరం మెనూలో కూరగాయలు పప్పు దినుసులు నాణ్యతాప్రమాణాలు పాటించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఉన్నతస్థాయిలలో, ప్రాథమికస్థాయిలో బోర్డింగ్ సౌకర్యాలతో కూడిన రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటుచేయడంద్వారా సమాజంలోని వెనుకబడిన సమూహాల బాలికలకు నాణ్యమైన విద్య సాధ్యమయ్యేలా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలని నాణ్యమైన మెనూ అందించాలని ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొడుకును చంపిన కన్న తండ్రి..

-కమలాపూర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

-వివరాలు వెల్లడించిన సిఐ రేణుక

వివరాలు వెల్లడిస్తున్న సిఐ రేణుక, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి

పెద్దశంకరంపేట, జూలై 4, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కమలాపూర్ గ్రామంలో గురువారం ఉదయం జరిగిన తోట సుధాకర్ హత్య కేసును పోలీసులు చేదించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో అల్లాదుర్గ్ సిఐ రేణుక ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం వెల్లడించారు. మద్యానికి బానిసైన కొడుకు వేధింపులు తాళలేక తండ్రి తోట చిన్న నరసింహులు హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు తోట చిన్న నరసింహులకు ముగ్గురు కొడుకులు. మొదటి, మూడవ ఇద్దరు కొడుకులు హైదరాబాదులో నివసిస్తున్నారు. రెండవ కొడుకు అయిన మృతుడు తోట సుధాకర్ తండ్రి వద్ద ఉంటూ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతడి భార్య గత రెండు సంవత్సరాల క్రితం చనిపోయిందన్నారు. మృతుడికి పోలియో వ్యాధితో బాధపడుతున్న ఒక కొడుకు, మూడు సంవత్సరాల కూతురు ఉన్నారు. భార్య చనిపోయినప్పటి నుంచి మృతుడు తోట సుధాకర్ మద్యానికి బానిసైనట్లు పోలీసులు తెలిపారు. ఆటో నడపగా వచ్చిన డబ్బులతో ప్రతిరోజు మద్యం సేవించి తల్లిదండ్రులతో గొడవపడేవాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో మృతుని తల్లి మానెమ్మ శనివారం వైద్యచికిత్స నిమిత్తం పెద్ద కొడుకు సాయిలు వద్దకు హైదరాబాద్ వెళ్ళింది. బుధవారం రాత్రి మృతుడు తోట సుధాకర్ మద్యం సేవించి రాత్రికి ఇంటికి చేరుకొని తండ్రితో గొడవపడి తనకు 30వేల రూపాయలు ఇవ్వాలని లేకపోతే తెల్లారేసరికి అంతు చూస్తానని బెదిరించినట్లు పేర్కొన్నారు. మృతుని మాటలకు విసుగుచెందిన తండ్రి ఎప్పటికైనా తనకు ప్రాణహాని ఉందని భావించి ఎలాగైనా ఇతన్ని అంతమొందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దీంతో గురువారం తెల్లవారుఝామున నర్సింలు ఇంట్లో ఉన్న రోకలిబండతో మృతుడు సుధాకర్ తలపై గట్టిగా రెండు మూడుసార్లు కొట్టడంతో సుధాకర్ అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు తోట నరసింహులును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అల్లాదుర్గం సిఐ రేణుక తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్ రెడ్డి, పోలీస్ సిబ్బంది వినోద్‌కుమార్, లింగోండ తదితరులు ఉన్నారు.

సేవారత్న అవార్డ్‌కు ఎంపికైన శివ

చిన్నశంకరంపేట, జూలై 4, ప్రభాతవార్త:

సానీక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు ధరావత్ శివ నాయక్ మరో అవార్డుకు ఎంపికయ్యారు. డైమండ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సమాజ్ సేవ రత్న అవార్డు-2025కు ఎంపికైనట్లు శివ తెలిపారు. గత 12 సంవత్సరాల నుండి చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఢిల్లికి చెందిన పబ్లిక్ వెల్ఫేర్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాజేష్ నాథ్ తెలిపినట్లు శివ తెలిపారు. ఈ అవార్డును ఉత్తరప్రదేశ్ లేదా

షాదిముబారక్,కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ

అత్తాపూర్ జూలై 4, ప్రభాతవార్త :
పేదింటి ఆడపిబిడ్డలకు షాదిముబారాక్,కల్యాణ లక్ష్మీ చెక్కులు ఎంతో ఉపయోపడుతున్నాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.శుక్రవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాములు ఆధ్వర్యంలో లబ్దిదారులకు షాదీముబారక్,కల్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్విహించారు.అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తహసీల్దార్ స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు 501 చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకొని ఆర్థికంగా లబ్దిపొందాలన్నారు. పేదింటి యువతుల వివాహానికి కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు ఎంతో లబ్ధిచేకూరుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పార్టీ నాయకులు లబ్ధిదారులు,సిబ్బంది ఉన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ధనుంజయ్,ఇంద్రపాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

రాజేంద్రనగర్ డివిజన్ హైదర్‌గూడ మాపుల్ టౌన్ కాలనీలో రూ.19 లక్షల అంచనా వ్యయంతో నిర్మించానున్న డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ అర్చన జయప్రకాష్,డివిజన్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ దయనంద్,అధికారులు,పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డిప్లామా కోర్సుల ప్రవేశానికి కౌన్సిలింగ్

అత్తాపూర్ జూలై 4, ప్రభాతవార్త :
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ డిప్లోమా కోర్సులలో ప్రవేశానికై కౌన్సిలింగ్ జూలై 8 వ తేది నుండి 11 వ తేది వరకు యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.జి.ఇ.సి.హెచ్ .విద్యాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ డిప్లోమా కోర్సుల ప్రవేశానికై పాలీసెట్ ర్యాంకు తప్పనిసరి,కౌన్సిలింగ్‌కు హాజరయ్యే ర్యాంకుల వివరాలు ఆయా తేదిలు,వివరాలు మొదలగునవి విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌పై చూడగలరని తెలిపారు.ఈ కౌన్సిలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు నిర్ణిత ఫీజును కూడా తీసుకు రావాలని రిజిస్ట్రార్ తెలిపారు.సీట్ల కేటాయింపు పాలీసెట్ ర్యాంక్‌ల ఆధారంగా జరుగుతుందని తెలిపారు.రిజర్వేషన్‌ల నిబంధనలకు లోబడి కౌన్సిలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన తెలియజేశారు.కౌన్సిలింగ్‌కు సంబంధించిన ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించగలరని తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

అత్తాపూర్ జూలై 4, ప్రభాతవార్త :
రాజేంద్రనగర్ సర్కిల్, శేర్లింగంపల్లి ప్రాజెక్ట్ మైలార్‌దేవ్‌పల్లి సెక్టార్‌లోని పద్మశాలిపురం అంగన్‌వాడీ సెంటర్1లో శుక్రవారం బరువు తక్కువగా ఉన్న చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ కూడికల రాజేశ్వరీ చిన్నారులకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారుల బరువు, పొడవు కొలతలు తీసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన ఆవశ్యకతను ఆమె వివరించారు. ఈ సందర్భంగా టీచర్ రాజేశ్వరీ మాట్లాడుతూ... "బరువు తక్కువగా ఉన్న పిల్లల ఆరోగ్యం మెరుగుపడేందుకు పోషకాహారం అందించటం అనేది ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పర్ మంగ దేవి, అక్షిత, స్వాతి, శ్రీ దుర్గవల్లి తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ యూనివర్సిటీలో ఉచితంగా రాబీస్ వ్యాక్సినేషన్

అత్తాపూర్ జూలై 4, ప్రభాతవార్త :
ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనె 7వ తేదీన వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్, వెటర్నరీ సైన్స్ కాలేజ్, రాజేంద్రనగర్, పి.వి.నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం, బుద్వేల్ క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించబడుతుందని ప్రొఫెసర్ డాక్టర్ రామచంద్ర రెడ్డి తెలిపారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ప్రజల పెంపుడు జంతువులైన కుక్కలు మరియు పిల్లులకు ఉచితంగా రాబీస్ వ్యాక్సినేషన్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇ ఉచిత రాబీస్ టీకా కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తద్వారా రాబిస్ సోకిన కుక్క కాటు వల్ల సక్రమించే రాబిస్ వ్యాధిని నివారించవచ్చుని తెలిపారు.ప్రజలందరు తమ పెంపుడు జంతువులను తీసుకుని రావడం ద్వారా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ డాక్టర్ రామన్ ముఖ్య అతిథిగా జూనోసిస్ డే ప్రముక్యతను ప్రసంగించనున్నారని తెలిపారు.

ఎంపీ రఘునందన్‌ను పరామర్శించిన ఈటల రాజేందర్

కెపిహెచ్బి కాలనీ, జూలై 4, ప్రభాతవార్త
ఇటీవల సికింద్రాబాద్ యశోదా ఆసుపత్రిలో కుడి కాలికి శస్త్రచికిత్స చేయించుకునీ డిశ్చార్జ్ అయి విశ్రాంతి తీసుకుంటున్న మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావుని శుక్రవారం మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య, క్షేమ సమాచారం గురించి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వంగవీటి రంగా చేసిన సేవలు చిరస్మరణీయం

కెపిహెచ్బి కాలనీ, జూలై 4, ప్రభాతవార్త
పేద ప్రజల కోసం మాజీ శాసనసభ్యులు స్వర్గీయ వంగవీటి రంగా చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగించాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మోహనరంగా 78వ జయంతిని పురస్కరించుకుని కేపీహెచ్బీ కాలనీ బస్టాండ్‌లో ఉన్న రంగా విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బండి రమేష్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

భారతదేశ యుకె స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం ప్రభావంపై చర్చ

నాంపల్లి, జూలై 4 ప్రభాతవార్త : భారతదేశంలోని పురాతన, ప్రముఖ జాతీయ వాణిజ్య సంఘం పిహెచ్‌డి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పిహెచ్‌డిసిసిఐ) ప్రముఖ పారిశ్రామికవేత్త, పోకర్ణగ్రూప్ ఛైర్మన్-ఎండి గౌతమ్‌చంద్ జైన్ తొలి అధ్యక్షుడుగా తన తెలంగాణ శాఖను ప్రారంభించి భారతదేశ యుకె స్వేచ్ఛావాణిజ్యం ఒప్పందం (ఎఫ్‌టిఎ) భారత పరిశ్రమలపై ప్రభావం అనే అంశం మీద ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించింది. ఈ సమావేశంలో ముఖ్యంగా ఏపి అండ్ తెలంగాణ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎఫ్‌టిఎ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని గణనీయంగా పెంచుతుందన్నారు. గత ఏడాది 43బిలియన్ల డాలర్ల వాణిజ్యం జరిగినట్లు రానున్న 10 సంవత్సరాల్లో 50శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తమ కార్యాలయం ద్వారా భారత ఎగుమతి దిగుమతులకు పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. పీహెచ్‌డిసిసిఐ జాతీయాధ్యక్షుడు హేమంత్ జైన్ మాట్లాడుతూ పీహెచ్‌డిసిసిఐ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోందని, 55 పారిశ్రామిక విభాగాలు కలిగివుందని వివరించారు. 1.5లక్షలకుపైగా ప్రత్యక్ష పరోక్ష సభ్యులున్నారని తెలిపారు. అక్షయ్ ఎస్‌సి ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలోని ఐటి, ఔషధ వస్త్ర పరిశ్రమలకు పెద్దమొత్తంలో ప్రయోజనం కలుగనున్నదని, ఎఫ్‌టిఎ వల్ల ఎగుమతులు పెరిగి ఉద్యోగావకాశాలు కలుగుతాయని చెప్పారు. గౌతమ్ జైన్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ఎగుమతిదారులకు ఉపయోగమని, పేపర్‌వర్క్ తగ్గుతుందని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మెరుగవుతుందని, ఇది విన్-విన్ ఒప్పందమని అభివర్ణించారు. పీహెచ్‌డిసిసిఐ ప్రధాన కార్యదర్శి డా. రంజిత్ మెహతా ఇండియా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థని, యుకె నుండి మానవ వనరులు టెక్నాలజీ తీసుకు రావడం ద్వారా మన ఎంఎస్‌ఎంఇలకు భారీ అవకాశాలు కలుగుతాయని, క్లీన్ ఎనర్జీ లక్ష్యాల కోసం యుకె టెక్నాలజీ ఉపయోగపడుతుందని అన్నారు.

గౌతమ్‌చంద్ జైన్‌ను సత్కరిస్తున్న అతిథులు

9న సార్వత్రిక సమ్మెలో బ్యాంక్, బీమా ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలి

సైఫాబాద్, జూలై 4 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతోపాటు 4 కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాల, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 9వ జరిగే దేశవ్యాప్త సమ్మెలో బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మె సన్నద్ధంలో భాగంగా శుక్రవారం ఎఐబిఇఎ రాష్ట్ర కార్యాలయంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ పబ్లిక్ సెక్టార్ యూనియన్స్ (యుఎఫ్‌సియు) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సమావేశానికి పబ్లిక్ సెక్టార్ యూనియన్స్ కో-ఆర్డినేటర్ వి.ఎస్.బోస్ అధ్యక్షత వహించగా, రౌండ్ టేబుల్ సమావేశంలో యుఎఫ్‌పియు కన్వీనర్ ఎన్.వి.రమణ, ఎఐపిఆర్‌డిఎ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి.జలాలుద్దీన్, ఎం.శివశంకర్ (జిఐజిఎఐఎ, తెలంగాణ), పి.అజయ్‌కుమార్, పి.ఉదయ్ భాస్కర్ (డిజిఎస్-ఎపిటిబిఇఎఫ్), ఎఐబిఒఇ అధ్యక్షుడు పిఎస్‌పిఆర్ పణికుమార్, జిఐఇఎఐఎ ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.కిషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.ఎస్. రాంబాబు మాట్లాడుతూ నూతన ఆర్థిక విధానాల పేరుతో కేంద్ర ప్రభుత్వం తిరగమన పోకడలను అనుసరిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాలను ప్రైవేటు పరం చేసేందుకు నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ కంపెనీలపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న తప్పుడు విధానాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ రంగానికి అనేక రాయితీలు ఇస్తూ, కార్మికుల హక్కులను కాలరాస్తున్నదని ఆరోపించారు. 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో దేశవ్యాప్తంగా 25 కోట్లమంది సంఘటిత, అసంఘటిత కార్మికులు, రైతులు, బ్యాంకింగ్, బీమారంగ ఉద్యోగులు పాల్గొంటున్నారని చెప్పారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బి.ఎస్.రాంబాబు. చిత్రంలో వి.ఎస్.బోస్ కూడా ఉన్నారు

6న విఠల్‌నగర్‌లో విఠలేశ్వర ఉత్సవాలు ప్రారంభం

బేగంబజార్,జూలై 4 ప్రభాతవార్త: భక్తుల కోరికలు తీర్చే ఆలయంగా జంగల్ విఠోభా స్వామి(పాండురంగస్వామి) ఉస్మాన్‌షాహి విఠల్‌నగర్‌లో ఉన్న చారిత్రాత్మకమైన ఆలయంగా ప్రసిద్ధిగాంచింది.ఇక్కడ పూజలు చేస్తే కోరికలు ఫలిస్తాయని భక్తులకు అత్యంత విశ్వాసం ఉన్నందున ఈ ఆలయానికి భక్తులు నిత్యం పెద్ద ఎత్తున్న తరలి వస్తారు.ఈ ఆలయం ఎదురుగానే హన్‌మాన్‌మందిరం ఉంది.ఇక్కడ ప్రతియేటా ఆషాడ మాసంలో ఏకాదశి పూజలతోపాటు రథోత్సవంతోపాటు పాండురంగస్వామి వారిబ్రహ్మోత్సవములు పదిరోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.జంగల్ విఠోభా దేవాలయానికి ఎంతో చరిత్ర ఉంది. విఠల్‌నగర్ ఉస్మాన్‌షాహిలో ఉన్న జంగల్‌విఠోభా దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విఠలేశ్వర బాల భక్త సమాజం పధాన కార్యదర్శి పి.మాణిక్‌రావు, కోశాధికారివి. పాండు యాదవ్,ఉపాధ్యక్షులు గొవిందమహారాజ్‌లు మాట్లాడుతూ ఈనెల 6వ తేదిన ప్రారంభమై 13వ తేది వరకు కొనసాగుతాయన్నారు.ఆదివారం 6వతేదినతెల్లవారు జామున మహాభిషేకం,పూజహారతి,మహానైవైద్యం,రాత్రి ఏడుగంటలకు పల్లకిసేవ,స్వామి వారికి నూతనంగా తయారు చేసిన ఊయలలో(ఊంజల్)సేవ,వేదసేవ విఠలేశ్వర బాలభక్త మండలి వారిచే భజనలు,కీర్తనలు నిర్వహించడం జరుగుతుందన్నారు.6వ తేదిన తెల్లవారు జామున బ్రహ్మముహుర్తమున మహాభిషేకం,పూజ,హారతి పూజలు కొనసాగుతాయన్నారు.దేవాలయం నుంచి శేషవాహనంపై శ్రీస్వామి వారిని ఆసీనముగా గావించి రథంపై విఠలేశ్వర రుక్మాబాయి రథోత్సవ ఊరేగింపు పురవీధుల్లో కొనసాగుతుందన్నారు.పాండురంగ,రుక్మాబాయి ఊరేగింపు దేవాలయం వరకు ఉంటుందన్నారు.రథోత్సవానికి వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు విచ్చేయనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో విఠలేశ్వర స్వామి ఆలయ ప్రతినిధులు బోయినివెంకటేష్‌యాదవ్, వెంటరత్నం, ప్రకాష్‌చారి, ధన్‌రాజ్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, గోపి యాదవ్,సాయిరాంయాదవ్,గలిబే విశాల్ పాల్గొన్నారు.

టిజిఎస్పీడిసిఎల్ డైరెక్టర్లను కలిసిన ప్రైవేట్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్‌అసోసియేషన్

హైదరాబాద్,జూలై 4,ప్రభాతవార్త:
తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నూతనగా ఏర్పడినటువంటి టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు జిసి రెడ్డి ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం కమర్షియల్ డైరెక్టర్ సిహెచ్. చక్రపాణి, ప్రాజెక్టు డైరెక్టర్ శివాజీ, ఫైనాన్స్ డైరెక్టర్ కృష్ణా రెడ్డిని కలిసి పూలమాల శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జిసిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ప్రైవేట్ సెక్టార్‌లో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్టర్లు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వారికి కొద్దిగా వెసులుబాటు కల్పించి ఇప్పుడున్న వండర్ విధానాన్ని, గ్రేడ్ 3 నుండి గేట్ వన్‌కు మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యులు నక్క యాదగిరి మాట్లాడుతూ అనుభవం లేని వ్యక్తులు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం వల్ల ప్రమాదాలు, విద్యుత్ వృధా ఎక్కువగా అవుతుందని కావున అనుభవం కలిగిన లైసెన్స్ పొందిన వారి ద్వారా కనెక్షన్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. ఎం శ్రీనివాస్ గౌడ్, లైసెన్స్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జీ, మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్, కోశాధికారి కనకా చారి, జీడిమెట్ల డివిజన్ అధ్యక్షులు వెంకటరెడ్డి. కే మధుసూదన్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ చక్రపాణిని సన్మానిస్తున్న నక్కాయాదగిరి, జిసిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బెనర్జీ తదితరులు

సమస్యలపై కమిషనర్‌తో సమావేశమైన మాజీ మేయర్

కమీషనర్ శరత్‌చంద్రతో సమావేశమైన మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్

నార్సింగి, జూలై 4 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ శుక్రవారం కమీషనర్ శరత్‌చంద్రతో సమావేశమయ్యారు. మంచినీరు, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, సీసీ రోడ్లు, పారిశుద్యం, చెత్త సేకరణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆదేశాల మేరకు నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తున్నామన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వరద నీరు సాఫీగా దిగువ ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కమీషనర్ శరత్‌చంద్రతో చర్చించామన్నారు. అక్కడక్కడ మ్యాన్‌హోల్లు పగిలిపోయి డ్రైనేజి నీరు రోడ్లపై పారుతుందని, పాడైపోయిన మ్యాన్‌హోళ్లను వెంటనే మరమ్మత్తు చేసి కొత్త వాటిని అమర్చాలని కోరామన్నారు. డ్రైనేజి నీరు, వరద నీరు రోడ్లపై గాని, ఖాళీ ప్లాట్లల్లో గాని నిలువ ఉండకుండా చూడాలని, మట్టితో కట్టిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటే వెంటనే కూల్చి వేయాలని సూచించినట్లు వివరించారు. చెత్త నిలువ ఉంటే వర్షాలుకు కుళ్లిపోయి విష జ్వరాలను వ్యాపింపచేసే దోమలు, ఈగలు వృద్ధి చెందుతాయని, చెత్త నిలువ ఉండకుండా పారిశుద్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని పేర్కొనట్లు మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ స్పష్టం చేశారు. తాను కమీషనర్ శరత్‌చంద్ర దృష్టికి తీసుకెళ్లిన సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీనిచ్చారని మాజీ మేయర్ తెలిపారు.

సమ్మేళన సభకు తరలిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

జీడిమెట్ల, జులై 4, ప్రభాతవార్త
హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో రాజ్యంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ, పట్టణ స్థాయి కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళన భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ముఖ్యతిథిగా విచేస్తున్న సందర్భంగా ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చెయ్యడానికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్, కెకెఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి 40 బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలపై 3వేల మంది కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్,బ్లాక్ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, అనుబంధ సంఘాలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో బయలుదేరారు.

బోనాల ఉత్సవాల విశిష్టత మరింత పెరిగింది

-అత్తెల్లి కుటుంబం నుంచి అమ్మ వారికి తొలిబోనం సమర్పణ

-బోనంకు పూజలు చేసిన ఎమ్మెల్యే తలసాని

బేగంపేట జులై 4,ప్రభాతవార్త
బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన తర్వాతనే వాటి విశిష్టత మరింత పెరిగిందని మాజీ మంత్రి,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.శుక్రవారం రాంగోపాల్‌పేట మాజీ కార్పోరేటర్ అత్తెల్లి అరుణాగౌడ్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఓల్డ్‌బోయిగూడా లోని వారి నివాసం నుంచి ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా తొలిబోనాన్ని మహాకాళీ అమ్మ వారికి సమర్పించారు.బోనంకు పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జోగిని శ్యామలకు బోనం ఎత్తారు.శ్యామల బోనం ఎత్తుకుని డప్పు చప్పుళ్లు,నృత్యాలతో సికింద్రాబాద్ లోని శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారికి సమర్పించారు.ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఆషాడమాసం ప్రారంభమైతే బోనాల ఉత్సవాలతో జంట నగరాల్లో ఎంతో సందడి కోలాహలంగా ఉంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్,అరుణాగౌడ్,బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్,పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్,నాయకులు టి.శ్రీహరి,మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అత్తెల్లి నివాసం నుంచి బయలు దేరిన తొలిబోనం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని.

ఆలయం వద్ద జాతర కోసం ఏర్పాట్లను పరిశీలించిన ఇన్స్‌పెక్టర్ పరుశురాం.

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయం వద్ద ఈ నెల 13వ తేదీన ఆషాడ బోనాలు జరగనున్న నేపథ్యంలో మహంకాళీ ఇన్స్‌పెక్టర్ కె.పరుశురాం శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కల్సి క్షేత్ర స్థాయిలో పర్యటించి వివరాలు తెల్సుకున్నారు.బోనాల సందర్భంగా తాగునీరు అందుబాటులో ఉంచే ప్రాంతాలు,వైద్య శిభిరాలు నిర్వహించే ప్రాంతం,ప్రసాదం పంపిణీ ,కొబ్బరి కాయలు కొట్టే స్థలం,బారికేడింగ్,ఫైరింజన్ పాయింట్లు ,అంబులెన్స్‌పాయింట్లను ఏర్పాటు చేయాల్సిన స్థలాలను ఆర్ అండ్ బి,జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్,శానిటైజేషన్ తదితర శాఖాధికారులతో వెళ్లి పరిశీలించి గుర్తించారు.ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ కె.పరుశురాం మాట్లాడుతూ ఆషాడబోనాల జాతర సందర్భంగా శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంతో పాటు ఆలయం వెలుపల దారులలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నామని,పటిష్టమైన బధ్రతను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలియజేసారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి దాతలు ముందుకు రావాలి

- గండిపేట మండల విద్యాధికారి విజయ్ కుమార్

నార్సింగి, జూలై 4 ప్రభాతవార్త : ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఇస్తుందని, వీటికి తోడుగా దాతలు సహకారం అందిస్తే కార్పోరేట్ విద్యాలయాలకు ధీటుగా విద్యను అందిస్తామని గండిపేట మండల ఎంఇఓ విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం గంధంగూడలోని ప్రభుత్వ పాఠశాలలో ఓ విద్యా వాలెంటర్‌ను గ్లోబుల్, లర్నింగ్ లైట్స్ స్వచ్ఛంద సంస్థలు, కాంగ్రెస్ నేత హరీష్‌గౌడ్ సహకారంతో నియమించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా బలంగా ఉన్న వారు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సర్కారు బడులలో వసతుల మెరుగుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. హరీష్‌గౌడ్ చేస్తున్న సహకారం మరువలేనిదని, పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్న ఆయన తపనకు భేష్ అన్నారు. అనంతరం హరీష్‌గౌడ్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యా వాలెంటర్‌తో పాటు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, బుక్కుల భద్రపర్చుకునేందుకు అల్మారాలు, తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంటు, స్మార్ట్ క్లాస్‌లు నిరాటంకంగా జరిగేందుకు ఇంటర్‌నెట్ సౌకర్యం, మధ్యాహ్న భోజనం కోసం డైనింగ్ హాల్, వాల్ పేయింటింగ్స్, స్కూల్ భవనం మొత్తం పేయింటింగ్‌లతో పాటు అవసరమైన ఇతర వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు యశోద, నాయకులు పాండు, కాంటెస్టెడ్ కార్పోరేటర్ రాంప్రసాద్‌రావ్, యుఎస్‌టి గ్లోబల్ కంపనీ సీఎస్ఆర్ టీం, లర్నింగ్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమ్మేళనానికి బయలెక్కిన కాంగ్రెస్ శ్రేణులు

హైద్రాబాద్‌లో కాంగ్రెస్ సమ్మేళనానికి బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు

జహీరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:
హైద్రాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో నిర్వహించే కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమ్మేళనానికి జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు శుక్రవారం పార్టీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, మాజీమంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. సమ్మేళనానికి తరలివెళ్లిన వారిలో ఝరాసంగం, న్యాల్‌కల్, కోహీర్, మొగుడంపల్లి, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు పాటిల్, బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, రామలింగారెడ్డి, మక్సూద్, జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో పార్టీకి అనుకూలంగా నినాదాలుచేస్తూ తరలివెళ్లారు.

అంబేడ్కర్ అభయహస్తంను వెంటనే అమలు చేయాలి

-కెవిపిఎస్ జిల్లాకార్యదర్శి పి.అశోక్

నారాయణఖేడ్, జూలై 4, ప్రభాతవార్త:
నారాయణఖేడ్‌లో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్)ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.అశోక్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళిత కుటుంబాలకు అంబేద్కర్ అభయాసం ద్వారా 12 లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చిందని ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాల దగ్గరికి వస్తున్న అమలు చేయడం లేదని వెంటనే అమలు చేయాలని రాజీవ్ యువ వికాసం ద్వారా 50వేల నుండి నాలుగు లక్షల వరకు బ్యాంకు లింకేజీ ద్వారా సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తామని దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని జూన్ రెండో తేదీ నుండి అమలు చేస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని వెంటనేఅర్హులైన వారందరికీ రాజీవ్ యువ వికాసం డబ్బులు విడుదల చేయాలని అర్హులందరికీ నాలుగు లక్షల వరకు ఒకే దఫాలో ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈనెల 10వ తేదీన సంగారెడ్డి పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు సామాజిక న్యాయానికి ఎదురవుతున్న సవాలు అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నామని పెద్దఎత్తున పాల్గొని జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొత్తారి నర్సింలు సంతోష్ కుమార్ జిల్లా సహాయ కార్యదర్శిఎస్ గణపతి.అంబేద్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షులు బి.కన్నీరాం. సిఐటియు జిల్లా నాయకులు రమేష్ అంబేద్కర్‌పూలే సేవాసమితి డివిజన్ అధ్యక్షులు ఎస్ నరసింహులు. శివనంద్ కెవిపిఎస్ మండల బాధితులు అరుణ్, మోహన్, విజయ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణీకులకు జహీరాబాద్ డిపో శుభవార్త

-దూర ప్రాంత దైవ దర్శనానికి టూర్ ప్యాకేజీలు

జహీరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:
దూరప్రాంతంలోని దైవ దర్శనానికి వెళ్లే భక్తులకు జహీరాబాద్ టిఎస్ ఆర్టీసి శుభవార్త ప్రకటించింది. జహీరాబాద్ డిపో నుంచి దర్శనీయ ప్రదేశాలు, విజ్ఞానకేంద్రాలు, పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు వెళ్ళే భక్తులు, ప్రజలు, విద్యార్థులకు జహీరాబాద్ డిపో ప్రత్యేక టూర్ ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చిందని జహీరాబాద్ ఆర్టీసి డిపో మేనేజర్ టి.స్వామి తెలిపారు. మేనేజర్ టి.స్వామి కథనం ప్రకారం... జహీరాబాద్ డిపో నుంచి యాదగిరి గుట్ట, స్వర్ణగిరి మందిరాలకు ఈ నెల 6న ఉదయం 6 గంటలకు బస్సు బయలు దేరుతుందని, యాదగిరి గుట్టకు 10గంటలకు చేరుకుని దైవ దర్శనం అనంతరం మధ్యాహ్నం3గంటలకు స్వర్ణగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని దర్శనం అనంతరం రాత్రి 7 గంటలకు తిరుగు ప్రయాణం అయి జహీరాబాద్ డిపోకు రాత్రి 11 గంటలకు చేరుకుంటుందన్నారు. భక్తుల సౌకర్యార్థం ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులు అందుబాటులో ఉన్నాయని, డీలక్స్ బస్సులో పెద్దలకు 630 రూపాయలు, పిల్లలకు 350 రూపాయలు, ఎక్స్‌ప్రెస్ బస్సులో పెద్దలకు 540 రూపాయలు చిన్నారులకు 300 వందల రూపాయల చర్జీలను ఉంటాయన్నారు. మహారాష్ట్రలోని గాణగాపూర్ శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయానికి జహీరాబాద్ డిపోకు చెందిన డీలక్స్ ప్రత్యేక బస్సు హైద్రాబాద్‌లోని ఎంజిబిఎస్ నుంచి ప్రతి పౌర్ణమి పర్వదినానికి ముందు రోజు (ఈ నెలలో 9న) 12 గంటలకు బయలు దేరి సంగారెడ్డి చౌరస్తా, సదాశివపేట, జహీరాబాద్ మీదుగా గాణగాపూర్ ఆలయానికి సాయంత్రం 6.30 గంటలకు చేరుకుని రాత్రికి బస చేసి వేకువ జామున దైవదర్శనం అనంతరం ఉదయం 8 గంటలకు తిరుగు ప్రయాణమై జహీరాబాద్ మీదుగా 2 గంటలకు హైద్రాబాద్ చేరుకుంటుందన్నారు. డీలక్స్ బస్సులో పెద్దలకు 1090 రూపాయలు, చిన్నారులకు 580 రూయాలు చార్జీలు తీసుకుంటామన్నారు. వరంగల్‌లోని దర్శనీయ ప్రదేశాలైన వేయి స్తంభాల గుడి, భద్రకాళి మాత,రామప్ప గుడి, వరంగల్ కోట తదితర ప్రదేశాలకు వెళ్లేందుకు ఈ నెల 6వ తారీఖున ఉదయం 6 గంటలకు డిపో నుంచి బస్సు బయలు దేరి దర్శనీయ ప్రదేశాల దర్శనం అనంతరం రారతి 6 గంటలకు తిరుగు ప్రయాణమై జహీరాబాద్ డిపోకు రాత్రి 12 గంటలకు బస్సు చేరుకుంటుందన్నారు. డీలక్స్ బస్సులో పెద్దలకు 1000 వేయి రూపాయలు, పిల్లలకు 600 రూపాయలు, ఎక్స్‌ప్రెస్‌లో పెద్దలకు 850 రూపాయలు, చిన్నారులకు 500 రూపాయల వసూలు చేస్తామన్నారు. పూర్తి వివరాలకు ముందస్తు సీట్లరిజర్వేషన్‌కు 9121418750/ 9494093486/ 9676161161/9959226269లను సంప్రతించాలని డిపో మేనేజర్ టి. స్వామి వివరించారు.

ఎమ్మెల్యే కార్యాలయంపై బిజెపి నాయకులు దాడి చేయడం సిగ్గుచేటు

-బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా

గజ్వేల్, జూలై 4, ప్రభాతవార్త:
గజ్వేల్ పట్టణంలో ఉన్న బిజెపి నాయకులు మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ప్రధాన కార్యదర్శి బొగ్గుల సురేష్‌లు విమర్శించారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిజెపి నాయకులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడిచేయడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం అంటే సేవలకునిలయం అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్తే ప్రజల సమస్యలు తీరుతున్నాయని, సిఎం రిలీఫ్‌ఫండ్, ఇతర అత్యవసర చికిత్సలకు ఎల్‌ఓసిల మంజూరి దరఖాస్తులు, కళ్యాణలక్ష్మి చెక్కుల దరఖాస్తుల మంజూరు కోసం నియోజకవర్గంలో ఏ గ్రామంలో అయినా సమస్యలు ఉంటే చెప్పుకోవడానికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారి అందుబాటులో ఉంటున్నారన్నారు. వేలాదిమంది లబ్ధిదారులకు ఎల్‌ఓసి, సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందించడం జరిగిందన్నారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వ హయాంలో బిసిబంధు, దళితబంధు, మైనార్టీలకు ఇవ్వడంతో పాటు 120 మంది దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలు ఇవ్వడం జరిగిందన్నారు. రఘునందన్‌రావు ఎంపిగా ఒక సంవత్సరం గడుస్తున్నా ఒక్క రూపాయి తెచ్చిన పాపాన పోలేదన్నారు. బిజెపి నాయకులు పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్ బొగ్గుల చందు, మాజీ కో-ఆప్షన్ ఉమర్, రాచకొండ శ్రీనివాస్, మల్లేశం, ఎక్కలదేవి కనకయ్య, సోషల్ మీడియా అధ్యక్షుడు కరీం, కుమ్మరి పోచయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం

సిద్దిపేట అర్బన్, జూలై 4, ప్రభాతవార్త:
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో పేద ప్రజలకు అండగా ఉంటామని చేతగానీ హామీలు ఇచ్చి అధికారంలోకిరాగానే హామీలను అమలు చేయడంలో పూర్తిగావిఫలమవుతుందని ఆత్మకమిటీ మాజీడైరెక్టర్, బిఆర్ఎస్ నాయకులు కనకమల్లయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మిట్టపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయించాలన్నారు. బిఆర్ఎస్‌ను మండలంలో మరింత బలోపేతం చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుతామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఇస్తే జడ్పీటిసిగా బరిలోకిదిగుతానని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

జిన్నారం, జూలై 4, ప్రభాతవార్త:
ప్రభుత్వపాఠశాల బలోపేతానికి కృషిచేస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని వావిలాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మోల్డ్‌టెక్ కంపెనీ సహకారంతో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న రెండు అదనపు తరగతిగదుల నిర్మాణపనులకు శుక్రవారం ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు అత్యధికంగా విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యతోపాటు క్రీడారంగంపై ఆసక్తి పెంపొందించేలా ప్రతి పాఠశాలలో మైదానాలను ఏర్పాటు చేస్తూ వివిధ క్రీడలకు సంబంధించిన కోర్టులు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై వేలాది రూపాయలు ఖర్చు చేస్తోందని, జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్న లక్ష్యంతో చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపిపి రవీందర్‌గౌడ్, బాలవికాస్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి, గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, నవనీత్‌రెడ్డి, రవీందర్, పరిశ్రమ ప్రతినిధులు, స్థానిక నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తరగతిగదులనిర్మాణానికి శంకుస్థాపనచేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, జూలై 4, ప్రభాతవార్త:
భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడి నెలకొరిగిన, తెలంగాణరైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య చూపిన స్ఫూర్తిని కొనసాగించాలని జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ అంజయ్య అన్నారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య 79వవర్ధంతి సందర్భంగా పోతిరెడ్డి పల్లి చౌరస్తాకి సమీపంలోవున్న దొడ్డి కొమురయ్య విగ్రహానికి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఎమ్మెల్సీ అంజిరెడ్డిలు పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి జగదీష్, వెనుకబడిన తరగతుల కులసంఘంనాయకుల అధ్యక్షుడు మల్లికార్జున్‌పాటిల్, పుష్పనగేష్‌యాదవ్, బీరయ్యాయాదవ్, ప్రభుగౌడ్ సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితర కులనాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్లో మాజీ సిఎం రోశయ్య జయంతి

రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిఆర్ఓ ఇతర అధికారులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, జూలై 4, ప్రభాతవార్త:
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, అజాతశత్రువు, వివాద రహితుడు, ఆర్యవైశ్య భీష్మపితామహుడు, గాంధేయవాది, కాంగ్రెస్ సిద్ధాంతమే తన జీవనవిధానంగా జీవించిన స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతిని మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధికారికంగా సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ మినీకాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం జిల్లా రెవెన్యూ అధికారి, యువజన సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బెజుగం శ్రీనివాస్, జిల్లా ప్రధానకార్యదర్శి చీకోటి దయాకర్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి నామ భాస్కర్, కోశాధికారి అమేటి భాస్కర్, సంగారెడ్డి యువజన సంఘం అధ్యక్షుడు తోపాజి హరీష్ పాల్గొన్నారు.

రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్, అధికారులు...
స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతిని సంగారెడ్డి మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ కమీషనర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ సూర్యప్రకాష్, ఆఫీసుసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫోరం ఫర్ బెటర్ ఆధ్వర్యంలో...
దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేశ్‌కుమార్ సహా కార్యదర్శి గడ్డం పాండురంగం, సభ్యులు దొర్తల సుమన్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. భూస్వాములు, పెత్తందారుల అరాచకాలపై పోరాడి పేదప్రజల పక్షంనిలిచి పేదలకోసం అసువులు బాసిన తెలంగాణ సాయుధపోరాటానికి ప్రేరణగా నిలిచిన వ్యక్తి దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు.

యోగ ప్రయోజనాలు తెలుసుకొని యోగా చేయండి

-వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

గుమ్మడిడల, జూలై 4, ప్రభాతవార్త:
కానుకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వివేకానంద స్వచ్ఛందసేవ సమితి వ్యవస్థాపకులు, సరెడ్డిగారి బిక్షపతిరెడ్డి, ఆధ్వర్యంలో యోగపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కలిగిస్తూ 21జూన్ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కానుగుంట పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు చేసిన పిరమిడ్ (ప్రతిభకు)కు గాను విద్యార్థులకు బహుమానం శుక్రవారం ఇవ్వడం జరిగింది. పలు గ్రామాలలో ఆయా పాఠశాలలో ఉచితంగా విద్యార్థులకు విద్యార్థినిలకు గ్రామ యువకులకు యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి యోగ పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వివేకానంద స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపకులు బిక్షపతి రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పిఈడి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సంతపురం కృష్ణ,డాక్టరేట్ అవార్డు గ్రహీత విష్ణు, కుమ్మరి వెంకటేష్, రెడ్డిపల్లి అశోక్, కానుకుంట గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌తో అన్నదాతలకు అధిక లాభాలు

రైతులకు సూచనలు చేస్తున్న లీవ్‌పామ్ కంపెనీ ప్రతినిధులు

అల్లాదుర్గం, జూలై 4, ప్రభాతవార్త:
ఆయిల్ పామ్ సాగుతో అన్నదాలు అధిక లాభాలు ఆర్జించవచ్చని లీవ్ ఫామ్ కంపెనీ టెక్నికల్ అడ్వైర్ డాక్టర్ వైయస్ రంగనాయకులు అన్నారు. మండల కేంద్రమైన అల్లాదుర్గంలో శుక్రవారం రైతులతో ప్రత్యేకంగా సమావేశం ఆయిల్ ఫామ్‌సాగుపై అవగాహన కల్పించారు. ఒక సారి పంట వేయడంతో దీర్ఘకాలికంగా లాభాలు అందుకోవచ్చన్నారు. కోతులు, పందుల బెడద ఈ పంటకు అసలే ఉండదన్నారు. మొదటి మూడు సంవత్సరాలు అంతర్ పంటలను సాగు చేసుకుని తర్వాత మూడు సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వరకు ప్రతి 20 రోజులకు ఈ పంటతో ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో లీవ్ ఫామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్, ఏఈఓ నవీన్ కుమార్ తదితరులు ఉన్నారు.

వంటమనిషి పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

మనూర్, జూలై 4, ప్రభాతవార్త:
మండలపరిధిలోని పుల్‌కుర్తిగ్రామంలోకి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వంటమనిషి పోస్టు ఖాళీగా ఉందని, వంటచేసే మహిళలనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకఅధికారి రాజేశ్వరి తెలిపారు. అర్హులైన స్థానిక మహిళలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 8వతారీఖులోగా దరఖాస్తులు చేసుకోవాలని రాజేశ్వరి పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కాంప్ ఆఫీసా..? బిఆర్ఎస్ పార్టీ భవనమా..?

-ప్రభుత్వ భవనంలో ప్రతాప్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లు పెట్టడం ఏమిటి

-బిజెపి పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్

ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయం వద్ద నిరసనతెలుపుతున్న బిజెపి నాయకులు

గజ్వేల్, జూలై 4, ప్రభాతవార్త:
ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని దుర్వినియోగం చేస్తూ ఏసంబంధం లేకుండా బిఆర్ఎస్‌పార్టీ నాయకులు ప్రెస్‌మీట్‌లు, బర్త్‌డేలకు వాడుకుంటున్నారని బిజెపి పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేవులపల్లి మనోహర్‌యాదవ్ మాట్లాడుతూ బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాజ్యాంగేతర శక్తులలాగా చేస్తున్నారని విమర్శించారు. అధికార దుర్వినియోగంతో ప్రభుత్వ భవనాన్ని బిఆర్ఎస్‌పార్టీ గెస్ట్‌హౌస్‌గా వాడుతున్నారని ఎద్దేవాచేశారు. స్థానికంగా ఉన్న అధికారులు చూసీచూడనట్లు వదిలేయడం సరైందికాదని, ఇప్పటికైనా క్యాంప్ కార్యాలయం ప్రజా సమస్యలు చెప్పుకునేలా అందుబాటులో ఉండాలని, అధికారి లేదా ఎమ్మెల్యే తప్ప ఇతరపార్టీ సమావేశాలకు తావులేకుండా చూడాలని ఆర్డీఓకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ బిజెపి సీనియర్ నాయకులు ఉప్పల మధుసూదన్, ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి ప్రసాద్, నాగుముదిరాజ్, గొల్లపల్లి కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెప్యాల వెంకట్‌రెడ్డి, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్‌కుమార్, మాడ్గురి నరసింహా, మైస విజయ్, మంద వెంకట్, కొల్పుల నరేందర్, బిజెపి పట్టణ కార్యదర్శి తలారి రాజు, మహిళా మోర్చా అధ్యక్షులు కుంకుమ రాణి, భక్తమాల, స్వరాజ్యలక్ష్మి, బిజెవైఎం నాయకులు రాజేశ్వర్‌చారి, రోహిత్, కొక్కొండ అభినాష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

జోగిపేట, జూలై 4, ప్రభాతవార్త:
తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురమయ్య అని జోగిపేట మున్సిపల్ పట్టణ కురుమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గొర్లకాడి మల్లేశం, మాసగోని మల్లేశంలు అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం జోగిపేటలోని క్లాక్‌టవర్ వద్ద కురుమసంఘం సభ్యులు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ కురుమసంఘం యూత్ విభాగం అధ్యక్షులు బీర్ల అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కడాల క్రిష్ణ, కోశాధికారి ఊస జోగినాథ్, కురుమ సంఘం సభ్యులు కడాల రాములు, ఆంజనేయులు, శ్రీశైలం, మాసగోని లక్ష్మన్, మల్లేశం, సదాశివుడు, జి.లక్ష్మన్, కె.మల్లేశం, ఆనంద్, బి.మల్లేశం, శివ, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

సిద్దిపేట అర్బన్, జూలై 4, ప్రభాతవార్త:
తెలంగాణరైతాంగ సాయుధపోరాట తొలిఅమరుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని తెలంగాణ గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిఎంపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అలేటీ యాదగిరి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మామిండ్ల రేవంత్, అలేటి రజిత, మామిండ్ల రాము, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

-ఎస్ఐ దామోదర్

మొక్క నాటుతున్న ఎస్ఐ దామోదర్, బిజెపి మండల అధ్యక్షుడు రాంరెడ్డి

మర్కుక్, జూలై 4, ప్రభాతవార్త:
వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎస్ఐ దామోదర్ సూచించారు. మండలకేంద్రం మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా ఎస్ఐ దామోదర్ బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్, మాజీ ఎంపిటిసి చైతన్య శంకర్‌రెడ్డి, పిఆర్‌టియు మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు భూజాత, నరహరిప్రసాద్, వందన, పద్మారెడ్డి, రమేష్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, రమణారావు, గణేష్, సిద్ధయ్య, ఫౌజియా, కృష్ణ, బుచ్చయ్య, మాధవి, కవిత, మునీర్, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

అల్లాదుర్గం, జూలై 4, ప్రభాతవార్త:
మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. శుక్రవారం మండలకేంద్రమైన అల్లాదుర్గంలోని కస్తూర్బాగాంధీ బాలికలవిద్యాలయంలో ఎస్ఐ శంకర్, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంక రాజేశ్వర్‌లు విద్యార్తులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో సైబర్ నేరాలకు అనేకులు గురవుతున్నారని,సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం స్రవంతి, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లాస్‌తో ప్రతి ఒక్కరు విద్యను అందుకోవచ్చు

-అవగాహన కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్

సిర్గాపూర్, జులై 4, ప్రభాతవార్త:
ప్రతి ఒక్కరికి విద్యను అందుబాటులో ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండర్ స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని మండల పరిషత్ కార్యాయంలో ఉల్లాస్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్‌లో నేరుగా అడ్మిషన్‌లు ఇస్తున్నారని గుర్తు చేశారు. 14 సంవత్సరాలు నిండినవారు బడికి దూరంగా ఉన్నవారు, బడి మానేసిన వారు, పదోన్నతులు పొందగోరే వారు వయసుతో నిమిత్తం లేకుండా విద్యను అందుకునేందుకు జాయిన్ కావొచ్చన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు, వయోజనులు ఉల్లాస్ ద్వారా విద్యను పొంది ఉత్తీర్ణులు కావొచ్చన్నారు. ఇందిరాక్రాంతిపథకం, అంగన్‌వాడి, స్వయం సహాయక సంఘాల సభ్యులు సమష్టిగా కృషి చేస్తూ వయోజనులందరిని ఉల్లాస్‌లో చేరి విద్యను అందుకునేలా తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి మల్లూరు నాయక్, ఎపిఎం అనంతయ్య, అంగన్‌వాడి సూపర్‌వైజర్ సుజాత, ఐకెపి సిబ్బంది, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోండి

**సిర్గాపూర్, జూలై

వారాహి నవరాత్రి ఉత్సవాల్లో ఆదర్శ్‌రెడ్డి

వారాహి ఉత్సవాల్లో పాల్గొన్న నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, జూలై 4, ప్రభాతవార్త:
మండల పరిధిలోని భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి కాలనీలో అర్చకులు వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వారాహి నవరాత్రి మహోత్సవాల పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పూజాకార్యక్రమాలకు బిఆర్ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎంపి నిధులతో మెటల్‌కుంటలో బోరు మోటారు

-ప్రారంభించిన మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తిరుపతిరెడ్డి

కొత్త బోరును ప్రారంభిస్తున్న మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ తిరుపతిరెడ్డి

న్యాల్‌కల్, జూలై 4, ప్రభాతవార్త:
కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ మంజురుచేసిన నిధులతో బోరును డ్రిల్ చేయించడంతోపాటు మోటారు బిగించి ప్రజలకు తాగునీరు అందేలాచేసి ప్రజల దాహార్తిని దూరంచేశారు. మండలపరిధిలోని మెటల్‌కుంట గ్రామంలోని బిసికాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో గ్రామ మాజీ సర్పంచ్, జహీరాబాద్ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ దృష్టికితీసుకుపోగా డిఎంఎఫ్‌టి నిధులు మంజూరు చేయడంతో జూన్ 14న కాలనీలో బోరును తిరుపతిరెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి డ్రిల్‌చేయగా నీరు లభ్యమయింది. బోరుకు మోటారును బిగించి శుక్రవారం కాలనీవాసులకు తాగునీరు సరఫరా చేశారు. కాలనీలో బోరు ఏర్పాటుకు సహకరించిన ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌కు తిరుపతిరెడ్డి, కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు, మాజీవార్డు సభ్యులు మాణిక్‌రెడ్డి, నరేందర్ బాబు, పాండురంగారెడ్డి, బస్వరాజ్, శేఖర్, డేవిడ్, శ్రీకాంత్, మహేందర్ రెడ్డి, అశోక్, తుకారాం, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా కొణిజేటి రోశయ్య జయంతి

మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతిని జరుపుకుంటున్న అధికారులు

చౌటకూరు, జూలై 4, ప్రభాతవార్త:
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం మండలకేంద్రమైన చౌటకూరులోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో ఆధికారికంగా ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి 92వ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ సంధ్య, ఆర్ఐ ప్రమోద్, ఎంపిడిఓ శంకర్, పంచాయతీ కార్యదర్శి సందీప్, ఆర్వేజక్ ఆసుపత్రిలో డాక్టర్ సబితా, ఫార్మసిస్ట్ నర్సింలు, ఎస్ఎన్ఓ అజీమ్‌లు కొణిజేటి రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు.

బోరు పనులు ప్రారంభం

బోర్‌పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చింతాగోపాల్

సదాశివపేట, జూలై 4, ప్రభాతవార్త:
సదాశివపేటలోని 16వ వార్డులో శుక్రవారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతా గోపాల్ బోర్‌పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 16వవార్డులోని ప్రజల దాహార్తిని తీర్చడానికి జనరల్ ఫండ్ ద్వారా రూ.1లక్ష 60వేలతో బోరు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. తమ వార్డులోని ప్రజలకు ఈ బోరు వేయడం ద్వారా నీటి సమస్యను కొంతమేరకు తీర్చడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు విద్యాసాగర్‌రెడ్డి, ప్రకాష్, ఇంద్రమోహన్‌గౌడ్, ఆకుల శివ, నాయకులు కొత్త గొల్ల కృష్ణ, పిల్లిగుండ్ల వీరేశం, ముబీన్, నసీర్, నాగులవిజయకుమార్, బరాడి శివ, శమీ, కిరణ్, ఖాజా పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమ్మేళనానికి కాంగ్రెస్ శ్రేణులు

కాంగ్రెస్ సమ్మేళనానికి బయలెక్కిన కాంగ్రెస్ నేతలు

పుల్‌కల్, జూలై 4, ప్రభాతవార్త:
ఉమ్మడిపుల్‌కల్‌మండలంలోని ఆయాగ్రామాలనుంచి కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు శుక్రవారం హైద్రాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో నిర్వహించే పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, క్రియాశీలకార్యకర్తల సమ్మేళనానికి పుల్‌కల్, చౌటకూరు మండలాల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎం.దుర్గారెడ్డి, నత్తి దశరథ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసుకున్న వాహనాల్లో పార్టీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ తరలివెళ్లారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే ముఖ్య అతిథిగా హాజరవుతున్న సమ్మేళన కార్యక్రమానికి ఉమ్మడిపుల్‌కల్ మండలంలోని ఆయాగ్రామాల నుంచి పార్టీశ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. సమ్మేళన కార్యక్రమానికి తరలివెళ్లిన వారిలో ఆత్మకమిటీ చైర్మన్ మల్లారెడ్డి, డిసిసిబి మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, నాయకులు గోవర్ధన్, లక్ష్మారెడ్డి, తలారి అంజయ్య, కలాలి ఈశ్వర్‌గౌడ్, గుండన్నోల శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రా రెడ్డి, రమాగౌడ్, కైసర్, బాలాగౌడ్ తదితరులు ఉన్నారు.

సర్కారు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

-రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండాను ఎగరవేస్తాం

-హైదారాబాద్‌కు భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు



భారీ కాన్వాయ్‌తో హైదారాబాద్ తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట రూరల్, జూలై 4. ప్రభాతవార్త:
రాబోయేరోజుల్లో కాంగ్రెస్‌పార్టీ అధినేత రాహుల్ గాంధీని అధికారంలోకి తీసుకవస్తేనే దేశం అభివృద్ధి చెందడంతోపాటు అన్నివర్గాల ప్రజలకు న్యాయంజరుగుతుందని యావత్‌దేశప్రజలు ఎదురు చూస్తున్నారని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు)లు అన్నారు. హైదారాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో టిపిసిసి ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు ఖర్గే సభను విజయవంతం చేయడానికి నియోజకవర్గంనుంచి భారీకాన్వాయ్‌తో పార్టీశ్రేణులుతరలివెళ్లాయి. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీకి, రాహుల్‌గాంధీ,సోనియాగాంధీ,ఖర్గే, సిఎం రేవంత్‌రెడ్డిలకు అనుకూలంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. హైదారాబాద్ తరలివెళ్లే భారీ కాన్వాయ్‌ని జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ సర్కారు అధికారంలో ఉన్న 10యేళ్లకాలంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయమే జరిగిందన్నారు. బిఆర్ఎస్ పాలనపైవిసుగుచెంది ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. రాబోయేరోజుల్లో రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్న ఆలోచనలో ప్రజలు ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన సాగుతుందన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడానికి ప్రతి ఒక్కరం సైనికుల్లా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు మహేందర్‌రావు, సాకి అనంద్, పూజల గోపికృష్ణ, యాదగిరి, కలీం, లక్ష్మీ, ఎల్లం యాదవ్, సాంబ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైల్ రోకోకు ముదిరాజ్ సంఘం సంపూర్ణ మద్దతు

-మద్దతు లేఖను కవితకు అందజేసిన మహాసభ నేతలు

ఎమ్మెల్సీ కవితకు మద్దతు లేఖను అందజేస్తున్న ముదిరాజ్ నేతలు

గజ్వేల్ టౌన్, జులై 4, ప్రభాతవార్త:
ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 17న ఎమ్మెల్సీ కవిత చేపట్టనున్న రైల్‌రోకోకు తెలంగాణ ముదిరాజ్ మహాసభ నేతలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈమేరకు శుక్రవారం తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి నేతృత్వంలో నాయకులు ఎమ్మెల్సీ కవితకు మద్దతులేఖను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున నిలిచిన బిసిల అభ్యున్నతికి కట్టుబడి పని చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. బిసిలకు అన్నిరంగాలలో అవకాశం దక్కేలా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనుండగా, పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బిసి రిజర్వేషన్ బిల్లుకు చట్ట బద్ధత కల్పించేవరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతాయని ఎమ్మెల్సీ కవిత వివరించారు.

ఫీజు రీయంబర్స్‌మెంట్ పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల కోరుతూ పిడిఎస్‌యు ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న పిడిఎస్‌యు నాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, జూలై 4, ప్రభాతవార్త:
ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్‌యు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పెండింగ్ స్కాలర్‌షిప్ ఫీజు రీయంబర్స్మెంట్ 7200 కోట్లు విడుదల చేయాలని, డిగ్రీ ఇంజనీరింగ్ కాలేజీలో 72గంటల బందు సంగారెడ్డి జిల్లాలో విజయవంతమైందని పిటిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో ఐబి నుండి న్యూ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశామని అన్నారు. అనంతరం పిడిఎస్‌యు జిల్లాఅధ్యక్షులు ఎం.సురేష్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం పక్కాగా ఫీజు రీయింబర్స్మెంట్ ఇస్తానని నమ్మబలికిన రేవంత్‌రెడ్డి సర్కార్ పూర్తిగా ఆపథకాన్ని ఎత్తివేసేందుకు కుట్రలకు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు డివిజన్ నాయకులు ఎం.ప్రవీణ్, సిద్దు, అనిల్, సమీ, షరీఫ్, సందీప్, ఆకాష్, తుకారం, శ్రీకాంత్, హర్షిత్, పాల్గొన్నారు.

కుంటశిఖంలో వేసిన రోడ్డును తొలిగిస్తాం

-ఇరిగేషన్ ఎఈ వందన

వార్త కథనానికి స్పందన

కోడిపాక కుంటశిఖంలో వేసిన రోడ్డును పరిశీలిస్తున్న ఎఈ వందన

హత్నూర, జూలై 4, ప్రభాతవార్త:
వార్త కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. హత్నూర మండలం కోడిపాక గ్రామం పరిధిలోని హనుమాన్ కుంటలు అనుమతి లేకుండా రోడ్డు ఏర్పాటు చేశారంటూ శుక్రవారం వార్త దినపత్రికలో "అనుమతులు లేకుండా కుంటశిఖమ్ నుంచి రోడ్డు ఏర్పాటు" అనే శీర్షికతో ప్రచురితమైన విషయం తెలిసిందే. కథనానికి స్పందించిన హత్నూర మండల ఇరిగేషన్‌శాఖ ఎఈ వందన కోడిపాక గ్రామంలోని హనుమాన్ కుంటలో వేసిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఈ మాట్లాడుతూ అక్రమంగా వేసిన రోడ్డు, పూర్తిగా శిఖంలోనే ఉందని, దీనిని తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, చర్యలకొరకు పూర్తి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని ఎఈ వందన తెలిపారు.

కారెక్కిన కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బిఆర్ఎస్‌లోచేరిన కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:
పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సమక్షంలో కాంగ్రెస్ కార్యకర్తలు బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మొగుడంపల్లి మండలం బిఆర్ఎస్ అధ్యక్షులు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని విట్టునాయక్ తాండాకు చెందిన మాజీ వార్డు సభ్యులు శక్రు చౌహాన్, రాజుచౌహాన్, చౌహాన్ లక్ష్మణ్, నాయకులు ప్రకాష్‌చౌహాన్, తారా సింగ్‌రాథోడ్, గోపాల్‌చౌహాన్ తదితరులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు బిఆర్ఎస్ ఖండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపలన చైర్మన్ తంజిమ్, మాజీ పట్టణ అధ్యక్షులు మోఉహియుద్దిన్, మైనార్టీ నాయకులు గోరేమియా, మొగుడంపల్లి మండల బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గోపాల్, మాజీ సర్పంచ్ కేశసింగ్ రాథోడ్, మాజీ ఎంపిటిసి సభ్యులు చందు జాదవ్ మాజీ ఉపసర్పంచ్ శంకర్, డైరెక్టర్ కిషన్, రాజు, జితేందర్, చందర్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ సాయిలు

నాగల్‌గిద్ద, జూలై 4, ప్రభాతవార్త:
గ్రామాల్లోని ప్రజలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సాయిలు సూచించారు. శుక్రవారం ఎస్ఐ సాయిలు ప్రభాతవార్తతో మాట్లాడుతూ ప్రజలు వ్యవసాయపనుల్లో నిమగ్నమయి ఉన్నారని, అదే అదునుగా చేసుకుని అపరిచితవ్యక్తులు దొంగతనాలకు పాల్పడే అవకాశాలు ఉంటాయని, అపరిచితవ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

పాతపనులకు కొబ్బరికాయలు కొడుతున్న ఎమ్మెల్యే

-కాంగ్రెస్ పాలనలో గ్రామాలన్నీ చెత్తకుప్పలుగా మారాయి

-మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట, జూలై 4, ప్రభాతవార్త:
మెదక్ పట్టణానికి మెడికల్ కళాశాలను తెచ్చింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం పాతపనులకు కొబ్బరికాయలు కొడుతూ గొప్పలు చెప్పుకుంటుందని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మెదక్‌జిల్లా రామాయంపేటలోని బిఆర్ఎస్‌పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగారు. రామాయంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి గతంలో కేటాయించిన నిధులకే మళ్ళీ కొబ్బరికాయలు కొడుతున్నారని పద్మాదేవేందర్‌రెడ్డి ఆరోపించారు. దమ్ముంటే కొత్తనిధులు తీసుకురావాలని ఎమ్మెల్యే రోహిత్‌రావుకు ఆమె సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలన "కొత్త సీసాలో పాతసారా" లాగా మారిందని విమర్శిస్తూ, ప్రజలసమస్యలను పట్టించుకోకుండా ప్రతిపక్షాలపై కేసులుపెడుతూ ఇబ్బందిపెడుతున్నారని మండిపడ్డారు. మెదక్ జిల్లాకు వంద సీట్లతో బిఆర్ఎస్ ప్రభుత్వం మెడికల్ కళాశాల కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 50 సీట్లను కొడంగల్‌కు తరలించిందని పద్మాదేవేందర్‌రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క డబుల్‌బెడ్‌రూమ్ ఇవ్వలేదంటూ ఎమ్మెల్యేచేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. తమప్రభుత్వం వందలాది నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించామని, అవసరం అనుకుంటే ఈవిషయంపై బహిరంగచర్చకు సిద్ధమని ఆమెస్పష్టంచేశారు. రామాయంపేట డివిజన్‌ను తాము తీసుకువస్తే, ప్రభ్నుత్వ మారిన తర్వాత తదుపరిచర్యలుతీసుకోకుండా కాంగ్రెస్ దాన్ని గాలికి వదిలేసిందని ఆమె అన్నారు. రామాయంపేటకు డిగ్రీకళాశాల తెచ్చింది తానేనని ఆమె గుర్తుచేశారు. మెదక్ పర్యటనలో కెసిఆర్ మున్సిపాలిటీకి స్పెషల్ డెవలప్‌మెంట్‌ఫండ్ ద్వారా, మెదక్ రూ.50కోట్లు, రామాయంపేటకు రూ.20కోట్లు కేటాయిస్తే, వాటిని తీసుకువచ్చే దమ్ము ప్రస్తుత ఎమ్మెల్యేకు ఉందా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ప్రభుత్వం ప్రోటోకాల్ పాటించడం లేదని, కనీసం ఎస్కార్ట్‌లు కూడా ఇవ్వడంలేదని ఆమె విమర్శించారు. మెదక్ ఎమ్మెల్యేకు మాత్రం ప్రోటోకాల్‌కు విరుద్ధంగా, రెండు పోలీసు వాహనాలు ఎస్కార్ట్‌గా వస్తున్నాయనివిమర్శించారు. ప్రభుత్వంలో గ్రామాలన్నీ చెత్తకుప్పలుగా మారాయని ఆమె ఎద్దేవా చేశారు. గ్రామాలలోపారిశుధ్యం లోపించడంవల్ల, ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. సాధింపు చర్యలు మానుకొని మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేయాలని పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, పిఎసిఎస్‌చైర్మన్ బాదేచంద్రం, బిఆర్ఎస్‌పార్టీ మండల యువతవిభాగం అధ్యక్షుడు రాగి ఉమామహేశ్వర్, మాజీ సర్పంచులు సుభాష్ రాథోడ్, మైలారం శ్యాములు,మున్సిపల్ మాజీవైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మియాదగిరి, పిఎస్‌సిఎస్ డైరెక్టర్‌లు సుధాకర్‌రెడ్డి, పోచమ్మల ఐలయ్య,మాజీ మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ ఎస్‌కె అహ్మద్, పార్టీ నాయకులు చంద్రపు కొండల్‌రెడ్డి, చింతల రాములు, దాకి శ్రీనివాస్, హస్నుద్దీన్, భూమా మల్లేశం, కాట్రాలకుచెందిన కొత్త రాజేందర్‌గుప్తా, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

-సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మరాఠి కృష్ణమూర్తి

కంపెనీ ప్రతినిధికి సమ్మె నోటీసు అందజేస్తున్న కృష్ణమూర్తి

జగదేవ్‌పూర్, జూలై 4, ప్రభాతవార్త:
కేంద్రప్రభుత్వం తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిద్దిపేట జిల్లా సిఐటియు కమిటీ సభ్యులు మరాఠి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈనెల 9వ తేదీన దేశ వ్యాప్తంగా కార్మిక కోడ్‌లు రద్దు చేయాలని సార్వత్రిక సమ్మె జరుగుతుందని, సమ్మె నోటీలను శుక్రవారం మండలకేంద్రంలోని ఎన్ఎస్ఎన్ ఫార్మా, ఎల్‌టిఆర్ ఫార్మా కంపెనీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలలో పనిచేస్తున్న కార్మిక ఉద్యోగులకు సమ్మె రోజు వేసులుబాటు కల్పించాలని కంపెనీ ప్రతినిధులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను రైతులు విధిగా చేసుకోవాలి

-మండల రైతులకు ఎఓ ప్రవీణ్‌చారి సూచన

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఎఓ ప్రవీణ్‌చారి

నాగల్‌గిద్ద, జులై 4, ప్రభాతవార్త:
వ్యవసాయభూమి గల రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను విధిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌చారి సూచించారు. శుక్రవారం మండలంలోని దామర్‌గిద్ద, ఏస్గి గ్రామాల్లో ఏఈఓలు కొనసాగిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ పనులను ఏఓ ప్రవీణ్‌చారి పరిశీలించారు. మండలపరిధిలోని శాపూర్‌గ్రామంలో రైతులు పండిస్తున్న పత్తి, సోయాబీన్ తదితర పంటలను ఎఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌చారి మాట్లాడుతూ సాగవుతున్న పంటల అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ వెంట ఏఈఓలు సంతోష్, సావిత్రి, మహిపాల్ ఉన్నారు.

ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా పండగను నిర్వహించాలి

గద్దె నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

బెజ్జంకి, జూలై 4, ప్రభాతవార్త:
ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా పండగను ఘనంగా నిర్వహించాలని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు వడ్లూరి పర్శరాం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తోటపల్లి, వీరాపూర్, ముత్తన్నపేట, బేగంపేట గ్రామాల్లో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈనెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహించడానికి ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా గద్దెల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పర్శరాములు, రాజు, శంకర్, బాలయ్య, కాంగ్రెస్‌పార్టీ మండలఅధికారప్రతినిధి జనగాం శంకర్,గ్రామశాఖల అధ్యక్షులు రాంచంద్రం,రవీందర్,అంజి,కమిటీసభ్యులు పాల్గొన్నారు.

ఆషాఢ ఉత్సవాలకు ఎమ్మెల్సీకి ఆహ్వానం

ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న శశిధర్‌శర్మ

మర్కుక్, జూలై 4, ప్రభాతవార్త:
తెలంగాణ పండరీపురంగా పేరుగాంచిన శ్రీ పాండురంగ ఆశ్రమ 94వ ఆషాఢి ఉత్సవాలకు శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్‌రెడ్డికి ఆశ్రమప్రతినిధి, పిఆర్‌టియు సిద్దిపేటజిల్లా ప్రధానకార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ శుక్రవారం ఆహ్వానపత్రిక అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ మహిమాన్వితమైన పాండురంగ స్వామిని ఏకాదశి రోజు దర్శించుకుంటామని, తెలంగాణ ప్రాంతంలో వందేళ్లుగా ఆధ్యాత్మిక ప్రచారం చేస్తున్న పాండురంగ ఆశ్రమం గొప్ప పుణ్యక్షేత్రమని అన్నారు.

సమ్మేళనానికి వెళ్ళిన నాయకులు

మల్లికార్జున్ ఖర్గే మీటింగ్‌కు వెళ్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

పాపన్నపేట, జూలై 4, ప్రభాతవార్త:
జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో టీపీసీసీ ఆధ్వర్యంలో, ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో నిర్వహించిన గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనానికి పాపన్నపేట మండల పరిధిలోని ఆయా గ్రామాల గ్రామ కాంగ్రెస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరియు మండల నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాట్లాడుతూ..పదేళ్లపాటు కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉంటుందని, బడుగుబలహీనవర్గాల శ్రేయస్సు కోరేపార్టీ కాంగ్రెస్ అని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, రైతు రుణమాఫీ, సన్నధాన్యానికి బోనస్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గోవింద్ నాయక్, సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, సతీష్, భూమయ్య, నాని, టప్ప రాములు, నరేందర్ గౌడ్, కిష్టయ్య, సత్య గౌడ్, కలీం వివిధగ్రామాల అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, నాయకులున్నారు.